మోటార్లను అమ్మేశాడు..!



- టీడీపీ హయాంలో ఉచిత మోటార్లు
- రైతులకు పంపిణీ చేయకనే ఎన్నికల కోడ్
- అధికారం మారగానే 295 మోటార్లు మాయం
- సొంతం అన్నట్లు అమ్ముకున్న వైసీపీ నాయకుడు
- బిల్లుల కోసం తిరుగుతున్న కాంట్రాక్టర్
- సంబంధం లేదంటున్న విద్యుత్ శాఖ అధికారులు

శింగనమల



టీడీపీ హయాంలో రైతులకు మంజూరు చేసిన ఉచిత మోటార్లను వైసీపీ అధికారంలోకి రాగానే తెగనమ్ముకున్నారు. ఓ ప్రజాప్రతినిధి సమీప బంధువు ఏకంగా 295 మోటార్లను ఒక్కొక్కటి రూ.15 వేల నుంచి రూ.25 వేల ప్రకారం అమ్మి.. రూ.50 లక్షలకు పైగా సొమ్ము చేసుకున్నారు. ఈ వ్యవహారంపై ఏ ఒక్కరూ నోరు మెదపడం లేదు. విద్యుత్‌ను ఆదా చేసేందుకు.. టీడీపీ హయాంలో ఓ కంపెనీకి చెందిన 5 హెచ్‌పీ మోటార్లను రైతులకు ఉచితంగా సరఫరా చేశారు. రైతుల వద్ద ఉన్న పాత మోటార్లను తీసుకుని, కొత్తవాటిని అందజేశారు. కానీ శింగనమల మండలంలో పంపిణీ చేయకమునుపే ఎన్నికల కోడ్ వచ్చింది. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రావడం, ఓ నాయకుడు వాటిని అమ్ముకోవడం చకచకా జరిగిపోయింది.

రాగానే కొట్టేశారు...

శింగనమల మండలానికి 1,050 మోటార్లు మంజూరు అయ్యాయి. ఇందులో 298 మోటార్లు శింగనమల స్టాక్ పాయింట్‌కు చేరాయి. అన్ని మోటార్లు వచ్చిన తరువాతనే రైతులకు పంపిణీ చేయాలని, కొన్నే ఇస్తే రైతులు గొడవకు దిగే ప్రమాదం ఉందని అప్పట్లో విద్యుత్ శాఖ అధికారులు భావించారు. మిగిలిన స్టాక్ రాకమునుపే ఎన్నిక కోడ్ వచ్చింది. అధికారం వైసీపీ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఉచిత మోటార్లు స్టాక్ పాయింట్‌లోనే ఉండిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ మండలస్థాయి నాయకుడు వాటిపై కన్నేశాడు. మూడు మోటార్లు మినహా, మిగిలిన 295 మోటార్లను వైసీపీ నాయకుడు తీసుకువెళ్లారని, దీనికి విద్యుత్ శాఖలోని కొందరు అధికారులు సహకరించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోటార్లను రైతులకు ఉచితంగా ఇవ్వకుండా, ఒక్కొక్కరి నుంచి రూ.25 వేలు, రూ.15 వేలు.. రూ.10 వేలు.. ఇలా అందినకాటికి తీసుకుని అమ్ముకున్నారని సమాచారం.

రూ. 50 లక్షలకు పైగానే...

ఉచిత మోటార్లను వైసీపీ నాయకుడు కొట్టేయడం వెనుక అధికారుల పాత్ర ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధి ద్వారా అధికారులపై ఒత్తిడి తెప్పించి.. వాటిని అనంతపురంలోని ఓ దుకాణానికి విడతలవారీగా తరలించి అమ్ముకున్నారని సమాచారం. శింగనమల స్టాక్ పాయింట్‌లో ఉన్న మోటార్లను ఆ నాయకుడు మొదట తన కార్యాలయానికి తీసుకువెళ్లారని, ఆ తర్వాత స్వగ్రామానికి తీసుకెళ్లాడని అంటున్నారు. ఒక్కో మోటారు, స్టార్టర్ విలువ రూ.30 వేలు ఉంటుందని అధికారులు అంటున్నారు. వాటిని అనంతపురంలోని ఓ మోటార్ల దుకాణానికి విడతలవారీగా చేర్చారని, బేరం దొరికినట్లల్లా అమ్మేశారని సమాచారం. మొత్తం స్టాక్ విలువ సుమారు రూ.89 లక్షలు ఉంటుంది. వీటిని అమ్మడం ద్వారా కనీసం రూ.50 లక్షలు ఆ నాయకుడు వెనకేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి.

మాకు సంబంధం లేదు..

రైతులకు ఇవ్వాల్సిన ఉచిత మోటార్ల వ్యవహారంతో తమకు సంబంధం లేదని అప్పట్లో పనిచేసిన విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు. టీడీపీ హయాంలో 1050కి పైగా ఉచిత మోటార్లు మంజూరయ్యాయని, వాటిలో 298 మోటార్లు మాత్రమే స్టాక్ పాయింట్‌కు వచ్చాయని అంటున్నారు. ఆ కొన్నింటిని పంపిణీ చేస్తే మిగిలిన రైతులు గొడవకు వస్తారని భావించి పంపిణీ చేయలేదని అంటున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని కంపెనీ ప్రతినిధులకు అప్పగించామని, తమకు సంబంధం లేదని తేలిపోతున్నారు. అలా అయితే, కంపెనీకి తిరిగి పంపినట్లు ఆధారాలు చూపించాలని, లేఖను బహిర్గతం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, టీడీపీ హయాంలో వచ్చిన ఉచిత మోటార్ల గురించి తనకు సమాచారం లేదని విద్యుత్ శాఖ ఏఈ విజయ్‌కుమార్ అన్నారు.

బిల్లులు అడుగుతున్న కాంట్రాక్టర్

రైతులకు ఉచితంగా అందించేందుకు శింగనమల మండలానికి 5 హెచ్‌పీ మోటార్లు 298 ఇచ్చామని సంబంధిత కాంట్రాక్టరు అంటున్నారు. అవి రైతులకు అందినా, అందకపోయినా తనకు బిల్లులు చెల్లించాల్సిందేనని అంటున్నాడు. బిల్లుల కోసం విద్యుత్ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. సమగ్ర విచారణ జరిపితే ఈ మోటార్ల కుంభకోణం కథ బయట పడుతుందని రైతులు అంటున్నారు.

అమ్మేసుకున్నారట..



పెండింగ్ కరెంటు బిల్లులు కడితే ఉచితంగా 5 హెచ్‌పీ మోటారు ఇస్తామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న కరెంట్ బిల్లులు మొత్తం కట్టేశారు. మోటారు ఎప్పుడు ఇస్తారా అని ఎదురుచూశారు. ఇప్పటి వరకూ ఇచ్చిందే లేదు. వైసీపీ నాయకులు అమ్మేసుకున్నారని అంటున్నారు. రైతులకు ఇవ్వాల్సిన మోటార్లను అమ్మేయడం దారుణం. దీనిపై విచారణ జరిపించాలి. మాకు మోటార్లను ఇవ్వాలి.

- డి.నాగేంద్ర, రైతు, పెద్దమట్లగొంది

విజిలెన్స్ విచారణ చేపట్టాలి..



రైతులకు ఉచితంగా ఇవ్వాల్సిన మోటార్లను వైసీపీ నాయకులు అమ్ముకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారంపై విజిలెన్స్ అధికారులతో విచారణ చేయించాలి. రైతులను మోసం చేసిన నాయకులు, అధికారులపై చర్యలు తీసుకోవాలి. మోటార్లను రికవరి చేసి రైతులకు అందజేయాలి.

- మోడెం మధుయాదవ్, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు



కెఎస్ఆర్ కాలేజీలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

తొలిరోజు పరీక్షలు ప్రశాంతం

- 24,345 మంది హాజరు.. 710 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మార్చి 1: ఇంటర్ పరీక్షలు తొలి రోజు శుక్రవారం ప్రశాంతంగా సాగాయి. మొదటి రోజు కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో టెన్షన్ కనిపించింది. పరీక్ష ప్రారంభమయ్యేది ఉదయం 9 గంటలకైనా.. 8 గంటలకే కేంద్రాల వద్దకు విద్యార్థులు, తల్లిదండ్రులు చేరుకున్నారు. తొలిరోజు మొదటి సంవత్సరం విద్యార్థులకు సెకెండ్ లాంగ్వేజ్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 58 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. నగరంలోని కేఎస్ఆర్ జూనియర్ కళాశాల, ఎస్ఎస్‌బీఎన్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను కలెక్టర్ గౌతమి తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా జనరల్ విద్యార్థులు 22,920 మందికిగాను 22,311 మంది పరీక్షలకు హాజరయ్యారు. 609 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2,135 మందికిగాను 2,034 మంది హాజరుకాగా 101 మంది గైర్హాజరయ్యారని పరీక్షల కన్వీనర్ వెంకటరమణ నాయక్ తెలిపారు. కన్వీనర్ 3 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 4 కేంద్రాలను తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 8 కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్ రెండు కేంద్రాలను తనిఖీ చేశాయి.



మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

ఉపాధ్యాయ సమస్యల

పరిష్కారానికి కృషి

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 1: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని టీడీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యపై నిర్వహిస్తున్న ధర్నాకు ఆయన మద్దతు తెలిపారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలను టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటయ్యాక పరిష్కరిస్తామని అన్నారు. ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ భవన్ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు అండగా ఉంటామని అన్నారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం వస్తేనే ఉద్యోగుల జీవితాలు బాగుపడతాయని, ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. చంద్రబాబు సీఎం అయితే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు అండగా ఉంటారని అన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు శాయశక్తులా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

శ్రావణికి అభినందనలు



బండారు శ్రావణిశ్రీకి అభినందనలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

టీడీపీ శింగనమల నియోజకవర్గ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ఇంటి వద్ద టీడీపీ శ్రేణులు సందడి చేశాయి. పార్టీ అభ్యర్థిత్వం ఖరారయ్యాక ఆమె తొలిసారి జిల్లాకు వచ్చారు. విజయవాడ నుంచి శుక్రవారం ఆమె వచ్చినట్లు తెలియగానే శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున అనంతపురం నగరానికి చేరుకున్నారు. శ్రావణికి పుష్ప గుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు.

- శింగనమల

మా వాళ్లకే ఇవ్వండి..!



- ఉద్యోగం కోసం పాలకవర్గ సభ్యుడి పట్టు
- మార్కెటింగ్ శాఖ అధికారులకు హుకుం
- నిబంధనల ప్రకారమే అన్న అధికారులు

అనంతపురం రూరల్, మార్చి 1: 'ఆ ఉద్యోగం మా వాళ్లకే ఇవ్వండి.. నిబంధనలతో నాకు సంబంధం లేదు..' అని వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యుడు ఒకరు అధికారులకు హుకుం జారీ చేశారు. 'చిన్న ఉద్యోగం కూడా ఇవ్వలేనప్పుడు అధికారులుగా మీరుండి ఏం ప్రయోజనం..?' అని మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులపైనే చిందులు వేశారు. మార్కెటింగ్ శాఖ జిల్లా కార్యాలయం ఆయన చిందులకు వేదిక అయ్యింది. ఆయన ఎంత చించుకున్నా.. 'నిబంధనల ప్రకారమే ఉద్యోగం ఇస్తాం..' అని అధికారులు తెగేసి చెప్పినట్లు సమాచారం. దీంతో ఇతర ప్రాంతాలకు చెందిన మరికొంత మంది పాలకవర్గ సభ్యులతో కలసి విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. అక్కడ కూడా నిబంధనల మాట ప్రస్తావించడంతోపాటు ఆయన తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై కొన్నాళ్లుగా మార్కెటింగ్ శాఖ వర్గాల్లో చర్చసాగుతోంది.

ఓసీ మహిళకు ఇప్పించాలని..

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం బీసీ-బి మహిళకు కేటాయించారు. కమిటీ పాలకవర్గ సభ్యుడు తన వ్యక్తిగత సహాయకుడి భార్యకు ఆ ఉద్యోగం ఇవ్వాలని మార్కెటింగ్ అధికారులకు సూచించినట్లు తెలిసింది. ఆమె ఓసీ కావడంతో వారు అంగీకరించలేదు. ఆ పోస్టు భర్తీకి మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉన్నింది. ఈ క్రమంలోనే గత నెల రెండో వారంలో గుత్తి రోడ్డులోని మార్కెటింగ్ శాఖ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి జిల్లా బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి శాఖ ఉమ్మడి జిల్లాల ఏడీలతో పాటు జేడీ కూడా హాజరయ్యారు. ఆ సమయంలో శింగనమల, రాయదుర్గం, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల పాలకవర్గ సభ్యులతో కలసి అధికారుల వద్ద ఉద్యోగం గురించి ఆయన ప్రస్తావించినట్లు తెలిసింది. తాను చెప్పినవారికే ఉద్యోగం ఇవ్వాలని ఆయన ఏకంగా ఉన్నతాధికారులకు హుకుం జారీ చేశారని, వారు నిబంధనల మేరకు ఇస్తామని చెప్పడంతో ఆగ్రహంతో ఊగిపోయారని సమాచారం. ఉన్నతాధికారులు సైతం ఆయన ప్రతిపాదనకు ఒప్పుకోలేదు. కానీ ఆయన మాత్రం పట్టు విడవకుండా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని తెలిసింది.



విజయసాయిరెడ్డితో అనంతపురం వైసీపీ నాయకులు

మాలో ఒక్కరికి ఇవ్వండి..!

- అనంత టిక్కెట్ కోసం వైరివర్గం ప్రయత్నాలు

అనంతపురం క్రైం, మార్చి 1: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అనంతపురం అర్బన్ టిక్కెట్ కోసం 'అనంత' వైరివర్గం ప్రయత్నాలను ప్రారంభించింది. 'మాలో ఒక్కరికి అవకాశం ఇవ్వండి..' అని విజయసాయి, సజ్జలను కలిసి విన్నవించింది. గత ఎన్నికల సమయంలో టిక్కెట్ కోసం ప్రయత్నం చేసిన మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి, మహాలక్ష్మి శ్రీనివాస్, నదీమ్, వైవీ శివారెడ్డితోపాటు రంగంపేట గోపాల్‌రెడ్డి కూడా పార్టీ పెద్దలను కలిశారు. అందరూ కూడబలుక్కుని మరీ తాడేపల్లికి వెళ్లారు. తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరారు. దీని వెనుక టిక్కెట్ కోసం చేస్తున్న ప్రయత్నాలకంటే.. సిట్టింగ్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నామన్న సంకేతాన్ని పార్టీ అధిష్టానానికి పంపాలన్న వ్యూహం ఉందని ఆ పార్టీవారు అంటున్నారు. అర్బన్ అభ్యర్థి ఎవరో వైసీపీ అధిష్టానం ఇంతవరకూ ప్రకటించలేదు. అయినా, టిక్కెట్ తనదే అన్నట్లుగా ఎమ్మెల్యే అనంత ప్రచారం చేసుకుంటున్నారు. ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న నాయకులు.. ఒక్కసారిగా 'టిక్కెట్' పేరిట ఐక్యం కావడం చర్చనీయాంశంగా మారింది.

దొరికినంత దోచాడు..!

- మెటీరియల్ కొనకుండానే బిల్లులు కాజేశాడు
- ప్రశ్నించిన ప్రజాప్రతినిధికి కమీషన్ ఇచ్చాడు
- పంచాయతీరాజ్‌లో ఓ డీఈఈ అక్రమాలు
- ప్రభుత్వ భవన నిర్మాణాల్లో భారీగా అవినీతి

అనంతపురం సిటీ

పంచాయతీ రాజ్‌శాఖలో ఓ డీఈఈ స్థాయి అధికారిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనులు చేయకున్నా బిల్లులు డ్రా చేశారని, భవనాలకు పీవీసీ డోర్స్, కిటికీలు, స్టీల్ తదితర సామగ్రినికి కొనుగోలు చేయకుండానే సొమ్ము దిగమింగారని ప్రచారం జరుగుతోంది. పెద్ద ఎత్తున సిమెంట్‌ను పక్కదారి పట్టించి సొమ్ము చేసున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన వ్యవహారాల గురించి తెలిసి, ప్రశ్నించిన ఓ ప్రజాప్రతినిధికి కమీషన్ రుచి చూపించి గట్టెక్కారని అంటున్నారు. అక్రమాల గురించి ఆ శాఖ ఉన్నతాధికారులకు తెలిసినా మిన్నకుండిపోవడం అనుమానాలకు తావిస్తోంది.

భవన నిర్మాణాల్లో అవినీతి

ప్రభుత్వం చేపట్టిన గ్రామ, వార్డు సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ తదితర భవనాల నిర్మాణంలో ఆ అధికారి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఆ అధికారి పరిధిలో ఎక్కడా భవన నిర్మాణలలో పురోగతి లేదు. కానీ బిల్లులపరంగా పురోగతి కనిపిస్తోంది. 2021-22 సంవత్సరాలలో పలు భవనాలకు పీవీసీ డోర్స్, కిటికీలు, స్టీల్ తదితరాలను కొనుగోలు చేసినట్లు బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఈఈకి తెలియకుండానే, ఎంపీడీఓ ద్వారా బిల్లులు డ్రా చేశారు. కానీ కొనుగోళ్లు ఏవీ లేవని, కొన్నట్లు చూపించి బిల్లులు చేసుకున్నారని ఆ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. ఈఈకి తెలియకుండా ఏ బిల్లూ పాస్ కాకూడదు. కానీ సదరు డీఈఈ పని కానిచ్చేశారు. సిమెంట్‌ను సైతం పక్కదారి పట్టించారు.

రోడ్ల పనుల్లోనూ అందినకాటికి దోచుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. మొత్తంగా రూ.కోటికి పైగానే వివిధ రూపాల్లో అవినీతికి పాల్పడ్డారని సమాచారం. ఇందులో ఎవరి వాటా ఎంత ఉందో తెలియడం లేదని ఆ శాఖ వర్గాలు అంటున్నాయి.

ప్రజాప్రతినిధికి కమీషన్ ఎర

డీఈఈ అక్రమాల వ్యవహారం ఓ ప్రజాప్రతినిధి దృష్టికి వెళ్లింది. ఆయన ప్రశ్నించగానే కమీషన్ ఎరవేశారు. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారులు కూడా మిన్నకుండిపోయారు. ఇదే అదనుగా ఆ డీఈఈ మరింత రెచ్చిపోయాడు. నిబంధనలను గాలికి వదిలేసి అక్రమార్జనకు పాల్పడ్డాడు. ఆయన వ్యవహారాలు రచ్చకెక్కాయి. ఇక్కడే ఉంటే ఇబ్బందులు ఎదురవుతాయని భావించి, అడ్డదారిలో కర్నూలుకు డెప్యుటేషన్‌కు ప్రయత్నించాడు. ఆ శాఖ అప్పటి ఎస్ఈ దీనికి అంగీకరిస్తూ, ఈఎన్‌సీకి సిఫార్సు చేశారు. ఆ తరువాత ఎస్ఈ ఉద్యోగ విరమణ పొందారు. ఇదే క్రమంలో ఆ ప్రాంతానికి మరో వైసీపీ ప్రజాప్రతినిధి ఇన్‌చార్జిగా వెళ్లారు. ఆ డీఈఈ వ్యవహారం ఆయన దృష్టికీ వెళ్లింది. డెప్యుటేషన్ ప్రయత్నాలను ఆ ప్రజాప్రతినిధి అడ్డుకున్నారు. 'లెక్కలు చూపించే వరకు ఎక్కడికీ వెళ్లేందుకు వీల్లేదు..' అని ఆయన డీఈఈకి స్పష్టం చేశారు. అక్రమాల నిగ్గు తేలాల్సిందేనని అన్నారు. దీంతో డెప్యుటేషన్ ప్రయత్నాలు ఆగిపోయాయి. దీంతో ఆ డీఈఈకి చుక్కలు కనిపిస్తున్నాయట. ఇన్‌చార్జిగా వచ్చిన ప్రజాప్రతినిధికి కమీషన్ ఎరగా వేద్దామంటే.. ప్రస్తుతం బిల్లులు ఏవీ కావడం లేదు. తప్పులు సరిదిద్దుకునేందుకు సాధ్యం కాదు. ఆ ప్రజా ప్రతినిధి రోజూ ఏదో తరహాలో డీఈఈని ప్రశ్నిస్తూనే ఉన్నారని సమాచారం.

కొత్త ఎస్ఈకి అర్థంకాని వ్యవహారం

పంచాయతీ రాజ్‌శాఖ జిల్లా ఎస్ఈగా ఈరస్వామి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే జిల్లాలోని ఈఈలు, డీఈఈలు, సిబ్బందితో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. శాఖకు సంబంధించిన అంశాలపై ఆరా తీశారు. ఈ నేపథ్యంలో ఆ డీఈఈ పరిధిలో జరిగిన పనులకు సబంధించి సరైన నివేదికలు లేకపోవడాన్ని గుర్తించారు. సిమెంట్, స్టీల్, పీవీసీ డోర్స్ కిటికీలకు సంబంధించిన బిల్లులు సక్రమంగా లేవని తెలిసిపోయింది. కానీ ఏం చేయాలో తోచక మిన్నకుండిపోయారని సమాచారం. విజిలెన్స్ విచారణ జరిగితే అక్రమాలు బయటపడే అవకాశం ఉంది. అక్రమాలకు పాల్పడ్డ డీఈఈ వ్యవహారం బయట పడినా, అందులో ఎవరెవరు వాటాలు తీసుకున్నారో మాత్రం బహిర్గతం కావడం లేదు. విచారణ జరిగితే డీఈఈ ఇరుక్కోవడం ఖాయమని ఆ శాఖ వర్గాలు అంటున్నాయి.



జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ కార్యాలయం



రజత పతకంతో దీప

జాతీయ పోలీసు క్రీడల్లో దీపకు రజత పతకం

అనంతపురం క్రైం, మార్చి 1: జాతీయ పోలీసు క్రీడల్లో అనంతపురం రూరల్ స్టేషన్ కానిస్టేబుల్ దీప రజత పతకాన్ని సాధించారు. యోగా విభాగంలో ఆమె రెండో స్థానంలో నిలిచారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో గత నెల 26 నుంచి 72వ జాతీయ పోలీసు క్రీడలు జరుగుతున్నాయి. యోగా విభాగంలో విశాఖపట్నం దిశ పోలీస్‌స్టేషన్ సీఐ కళ్యాణితో కలిసి దీప రిథమిక ఫెయిర్ పోటీలలో పాల్గొన్నారు. రజత పతకం సాధించిన దీపను ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

ఎస్కేయూలో రాప్తాడు ఎమ్మెల్యే..!

- పలకరించేందుకే వచ్చారన్న వీసీ
- నేడు పాలకమండలి సమావేశం
- అజెండాలో అంశాలపై చర్చోపచర్చలు



అనంతపురం సెంట్రల్, మార్చి 1: ఎస్కేయూ పాలకమండలి సమావేశానికి ఒక్కరోజు ముందు, శుక్రవారం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వర్సిటీని సందర్శించారు. వీసీ ప్రొఫెసర్ హుస్సేన్ రెడ్డిని కలిశారు. 'కొత్తగా వచ్చాను.. పలకరించేందుకు ఎమ్మెల్యే వచ్చారు..' అని వీసీ పేర్కొన్నారు. కానీ వర్సిటీలో ఓ భూవివాదం నేపథ్యంలో ఎమ్మెల్యే అక్కడికి వెళ్లడం, అదీ పాలకమండలి సమావేశానికి ముందురోజు వెళ్లడం చర్చనీయాంశం అయ్యింది. వర్సిటీ స్థలాన్ని అధికార పార్టీవారికి అప్పగించేందుకు పాలకమండలి వేదికగా తిరిగి ప్రయత్నాలు మొదలవుతున్నాయని సమాచారం. నూతన భవనాల నిర్మాణం అంశంలో కాంట్రాక్టర్లకు ఎక్కువ డబ్బులు అందేలా చూసేందుకు పావులు కదుపుతున్నారని ప్రచారం జరుగుతోంది. గత వీసీ రామకృష్ణారెడ్డి అక్రమంగా నియమించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అకడమిక్ కన్సల్టెంట్స్‌కు వేతనాలు చెల్లించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని సమాచారం. ఒకరికి అడ్డదారిలో ఉద్యోగోన్నతి కల్పించే అంశం కూడా తెరపైకి వచ్చిందని తెలిసింది. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. కోడ్ వస్తే ఈ పనులన్నీ ఇప్పట్లో చేయడం సాధ్యం కాదు. అందుకే దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకునే ప్రయత్నాలు సాగుతున్నాయని సమాచారం. ఈ నేపథ్యంలోనే శనివారం పాలక మండలి సమావేశాన్ని నిర్వహించి, ఆమోద ముద్ర వేయించేందుకు సిద్ధమయ్యారని తెలిసింది. వర్సిటీ స్థలాన్ని లాక్కునేందుకు, తన వర్గానికి చెందిన కొందరు ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చేందుకు ఓ ప్రజాప్రతినిధి వర్సిటీ యాజమాన్యంపై ఒత్తిడిని తెచ్చారని వర్సిటీ వర్గాలు అంటున్నాయి.

నేడు పాలక మండలి సమావేశం...

ఎస్కేయూ పాలక మండలి సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నామని అధికార వర్గాలు తెలిపాయి. పీహెచ్‌డీ ప్రవేశాలు, అకడమిక్ కన్సల్టెంట్స్ పారితోషికం, కారుణ్య నియామకాలు, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ విభాగం పెండింగ్ బిల్లులు, రోజు వారి కూలీల నియామకం, ప్రమోషన్‌లు, సస్పెన్షన్ల ఎత్తివేత, వేతనాల చెల్లింపు.. ఇలా అనేక అంశాలతో కూడిన ఎజెండాను రూపొందించినట్లు తెలిసింది. సందట్లో సడేమియా అన్నట్లు అక్రమాలను సక్రమం చేసేందుకు ఈ సమావేశం వేదిక కానుందని అంటున్నారు.

పలకరించేందుకే ఎమ్మెల్యే వచ్చారు...

వీసీగా నేను కొత్తగా బాధ్యతలు తీసుకున్నాను. అందుకే రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పలకరించేందుకు వచ్చారు. ఆయనకు ఏదో కావాలని, చేసిపెట్టాలని అడగలేదు.

- ప్రొఫెసర్ హుస్సేన్‌రెడ్డి, ఎస్కేయూ వీసీ

ఎమ్మెల్యే గారూ.. మీ హామీ ఏమైంది..?

ఇప్పటికైనా డంపింగ్ యార్డు తరలించండి : టీడీపీ నాయకుల డిమాండ్

అనంతపురంరూరల్, మార్చి 1: డంపింగ్ యార్డును తరలిస్తానని గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని, ఇప్పటికైనా ఆ హామీని నిలబెట్టుకోవాలని తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కనుమ చౌడయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం గుత్తిరోడ్డులోని డంపింగ్ యార్డు వద్ద రాజీవ్‌కాలనీ వాసులతో కలసి టీడీపీ నాయకులు చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. డంపింగ్ యార్డు వలన రాజీవ్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గురువారం రాత్రి నుంచి వెలువడుతున్న విషవాయువుతో స్థానికులు అవస్థలు వర్ణతీతంగా ఉన్నాయన్నారు. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయన్నారు. దీని వలన స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ప్రజాప్రతినిధులకు ఈ విషయం తెలిసినా.. డంపింగ్ యార్డు తరలింపుపై చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా యార్డు తరలింపు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జిలాన్, కేశవ రాయల్, రామాంజి, అనిల్, ఇమ్రాన్, వీరేంద్ర, రామాంజనేయులు, చంద్రశేఖర్, రాజీవ్‌కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డు వద్ద ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు





బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా ధ్వజారోహణ చేస్తున్న పండితులు, నగరోత్సవంలో పాల్గొన్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాసులు, ఆలయ కార్యవర్గ సభ్యులు

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

మయూర వాహనంపై ఊరేగిన నీలకంఠుడు

అనంతపురం కల్చరల్, మార్చి 1: స్థానిక మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో శుక్రవారం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం కాశీవిశ్వేశ్వరునికి సుప్రభాతసేవ నిర్వహించారు. అనంతరం కలశ స్థాపన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష అలంకరణలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా ధ్వజారోహణ నిర్వహించారు. జిల్లా జడ్జి శ్రీనివాసులు కుటుంబ సమేతంగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన మయూర వాహనంపై స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యులు డి.సుబ్రహ్మణ్యం, వెంకటస్వామి, సురేష్‌బాబు, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు.



సోములదొడ్డిలో ఈ పంట నమోదును జాబితాను రైతులకు అందజేస్తున్న సిబ్బంది

రబీ ఈ పంట నమోదు సరిచూసుకోండి

అనంతపురంరూరల్, మార్చి 1: మండలంలో 2023-24లో రబీ సీజన్‌లో సాగు చేసిన ఈ పంట నమోదును రైతులు సరిచూసుకోవాలని వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. శుక్రవారం ఈపంట నమోదు జాబితాను మండలంలోని అన్ని ఆర్‌బీకేల్లో ప్రదర్శించినట్లు ఆయన తెలిపారు. మండలవ్యాప్తంగా 880 మంది రైతులు 2,188.02 ఎకరాల్లో రబీ సీజన్‌లో పంట సాగు చేసినట్లు తెలిపారు. ఆదివారం వరకు ఈ జాబితాను ప్రదర్శిస్తామని, జాబితాను రైతులు సరిచూసుకోవాలని, ఏవైనా తప్పిదాలు, అభ్యంతరాలు ఉంటే మంగళవారం లోపు రైతుభరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని అన్నారు. వాటిని సరిచేసి తిరిగి శుక్రవారం ఆర్‌బీకేల్లో జాబితాను ప్రదర్శిస్తామని తెలిపారు.

ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 1: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 35 రోజుల పాటు బెంగుళూరులో ఉచిత శిక్షణ, ఉద్యోగం కల్పిస్తామని ఆ సంస్థ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివి 18-26 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌లో ఉత్తమ శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 90004 87423ను సంప్రదించాలన్నారు.

మంచి సినిమాలతోనే గుర్తింపు : వైకుంఠం

అనంతపురం అర్బన్, మార్చి 1 : మంచి సినిమాలు తీసినప్పుడే ప్రజల నుంచి గుర్తింపు లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం వెయ్ దరువెయ్ సినిమా హీరో సాయిరామ్ శంకర్, ఆ సినిమా టీం సభ్యులు మాజీ ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు. అనంతరం సినిమా టీం సభ్యులతో కలిసి ఆయన సినిమా వీడియోను ఆవిష్కరించారు.



వీడియోను ఆవిష్కరిస్తున్న ప్రభాకర్ చౌదరి

బీకేకు ఎమ్మెల్యే టికెట్టు కేటాయించాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 1: అనేక సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్న బీకే పార్థసారధికి ఎమ్మెల్యే టికెట్టు కేటాయించాలని టీడీపీ టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాళ్ల నాగేంద్ర కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన కురబ సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పునరాలోచించుకొని కురబలకు అవకాశం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, కురబ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల కృష్ణయ్య, కురబ సంఘం నార్పల మండల అధ్యక్షుడు రాగే పరశురాం, శింగనమల అధ్యక్షుడు మంకేన నాగేంద్ర, బుక్కరాయసముద్రం మాజీ అధ్యక్షుడు ఓబుళపతి, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, కురబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వేణు, నాయకులు ఆదినారాయణ, అక్కులప్ప, కోరే విశ్వనాథ్, రాగే మురళీ, రాగే ఎల్లప్ప, గోపాల్, అంజి, కాటమయ్య పాల్గొన్నారు.

శిథిలావస్థలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను తొలగించండి

అనంతపురం అర్బన్, మార్చి 1: అనంతపురం పాతూరులో శిథిలావస్థకు చేరుకున్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను తొలగించాలని టీడీపీ నాయకులు నగర కమిషనర్ మేఘస్వరూప్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి వంకదారు వెంకటకృష్ణ, నాయకులు బాబాఫక్రుద్దీన్, సౌఖత్ అలీఖాన్, వెంకటేష్, ఆదినారాయణ ఆయనకు వినతి పత్రం అందజేశారు. 1982లో ఆ వాటర్ ట్యాంక్ నిర్మించారని, ఏడాది క్రితం పైభాగం కూలీ ట్యాంక్ నిరుపయోగంగా మారిందని అన్నారు. ఆ ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, ఉన్నట్లుండి కూలితే ప్రాణాపాయం జరిగే ప్రమాదం ఉందని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆ ట్యాంక్‌ను తొలగించి, దాని స్థానంలో కొత్త ఓవర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసి నగర ప్రజలకు నీటి సమస్య తీర్చాలని కోరారు.

టీడీపీ నాయకుడికి ఆర్థిక సాయం

ఆత్మకూరు, మార్చి 1: మండలంలోని మదిగుబ్బ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బూసి అక్కులన్న దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారిని మదిగుబ్బ మల్లికార్జునరెడ్డి శుక్రవారం పరామర్శించి.. రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వైద్య ఖర్చులకు తగినంత అందజేస్తానని భరోసా కల్పించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ భాస్కర్ నాయక్, టీడీపీ నాయకులు ఉన్నారు.

ముస్లిం మైనార్టీల ద్రోహి.. జగన్‌రెడ్డి

టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైపుద్దీన్

అనంతపురం అర్బన్, మార్చి 1: ముస్లిం, మైనార్టీల ద్రోహి సీఎం జగన్ అని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైపుద్దీన్ మండిపడ్డారు. శుక్రవారం స్థానిక సప్తగిరి సర్కిల్‌లో సీఎం జగన్‌కు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో ముస్లిం, మైనార్టీలకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా తీరని అన్యాయం చేశారన్నారు. ఐదేళ్ల పాలనలో ఒక్క హజ్ హౌస్‌ను ఏర్పాటు చేశారా అని నిలదీశారు. డంపింగ్ యార్డును తరలిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ఇప్పటి వరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. డంపింగ్ యార్డు రీసైక్లింగ్ పేరు రూ.22 కోట్లు బిల్లులు మంజూరు చేయించుకొని, ఎన్ని టన్నుల డంపింగ్‌ను రీసైక్లింగ్ చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. డంపింగ్ యార్డు తగలబడి పోవడానికి కారకులెవరో తేల్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఖాజాపీరా, పీఏ భాషా, మహ్మద్ రఫి, పవన్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సైపుద్దీన్ ఇతర నాయకులు

రోడ్డు ప్రమాదంలో చిన్నారి దుర్మరణం

రామగిరి, మార్చి 1: మండల సరిహద్దున జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారి వర్షిత (3) మృత్యువాత పడింది. రామగిరి గ్రామానికి చెందిన రఘువీరా అనంతపురానికి బైక్‌లో వెళ్తుండగా.. అదే ఊరికి చెందిన సంధ్య, తన కుమార్తె వర్షితను తీసుకుని అతనితో బయలుదేరింది. జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న కంటైనర్‌ను డ్రైవర్ డాబా వద్ద ఒక్కసారిగా ఆపే ప్రయత్నం చేశాడు. వెనుకే వస్తున్న రఘువీరా బైక్‌ను అదుపు చేయలేక.. వేగంగా వచ్చి ఆ కంటైనర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న ఆ ముగ్గురు తీవ్రంగా గాయ పడ్డారు. వారిని స్థానికులు అనంతపురం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వర్షిత మరణించింది. రఘువీరా, సంధ్య పరిస్థితి కూడా విషయంగా ఉందని, కర్నూలుకు తరలించాలని అనంతపురం వైద్యులు సూచించారు. ప్రమాదస్థలాన్ని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ కోసం గాలిస్తున్నామని, కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



ప్రమాదస్థలంలో రఘువీరా, సంధ్య



చిన్నారి వర్షిత (ఫైల్)



ఆర్థిక అక్షరాస్యత పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 1: ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని అధికారులు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అవార్డు గ్రహీత నందిత రూపొందించిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల-2024కు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం స్థానిక నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో విడుదల చేశారు. జనశిక్షణ సంస్థ డైరెక్టర్ ఖాదర్‌బాషా, నెహ్రూ యువకేంద్రం ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు మాట్లాడుతూ... ప్రతిఒక్కరూ సంపాదనతో పాటు పొదుపును అలవర్చుకోవాలని, ఆర్థిక అక్షరాస్యత క్రమశిక్షణ పాటించాలని అన్నారు. కార్యక్రమంలో నందిత, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు రాజా, మహేంద్ర, జయమారుతి, శ్రీకాంత్, దివ్యతేజ, రూబీఖాన్ పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు చెక్కు ఇస్తున్న ప్రొఫెసర్ రాజేశ్

రామగిరి, మార్చి 1: మండలంలోని పెద్దయ్యగారికొట్టాల గ్రామానికి చెందిన అక్కులప్ప భార్య రమాదేవి వారం క్రితం విద్యుదాఘాతానికి గురై మరణించింది. ఆమెకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న వీపీఆర్వో స్వచ్ఛంద సంస్థ అధినేత, ప్రొఫెసర్ రాజేశ్ శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి... పిల్లల చదువు కోసం రూ.లక్ష చెక్కును అందజేశారు. ఆయన వెంట కోనాపురం కేపీ ముత్యాలు, మండల మాజీ వైస్ ఎంపీపీ కత్రెన్న, కొండాపురం పోతన్న, ననకోట రామాంజి ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె: ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ శుక్రవారం తెలిపారు. ఐదో తరగతి చదివే విద్యార్థులు ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వారికి ఏప్రిల్ 21న పరీక్ష నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు 70329 96404ను సంప్రదించాలన్నారు.

ఎస్వీఐటీలో వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధ్యాపకులు

రాప్తాడు, మార్చి 1: హంపాపురం సమీపంలోని ఎస్వీఐటీ కళాశాలలో ఇన్నోవేషన్ సెల్ విభాగం ఆధ్వర్యంలో ఇంట్రప్రెన్యూర్‌షిప్ వర్క్‌షాప్‌ను శుక్రవారం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ మాట్లాడుతూ.. ఈ వర్క్‌షాప్ వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ క్రిష్టారెడ్డి, వైస్ చైర్మన్ రవీంద్రారెడ్డి, సీఈఓ ఆనంద్‌కుమార్, ప్రిన్సిపల్ విష్ణువర్ధన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ సంపాదనే ఎమ్మెల్యే తోపు ధ్యేయం

ఆత్మకూరు, మార్చి 1: రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సమస్యలను గాలికి వదిలేసి .. అక్రమ సంపాదనే ధ్యేయంగా పాలన సాగించారని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ. చెరువులో 42 ఎకరాలు భూమిని వారి కుటుంబ సభ్యులు పేరు మీద 1బి అడంగల్ చేయించుకున్న విషయం ప్రజలందరికీ తెలుసునని, రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సాధికార కమిటీ ఉపాధ్యక్షుడు సాకే బ్రహ్మ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

అనంతపురం క్రైం, మార్చి 1: నగరంలోని రెండో రోడ్డుకు చెందిన విజయలక్ష్మి అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. గురువారం ఉదయం కళాశాలకు వెళ్లిన విజయలక్ష్మి ఇంటికి తిరిగి రాలేదు. శుక్రవారం కూడా రాకపోవడంతో కుటుంబసభ్యులు బంధువుల వద్ద ఆరా తీశారు. తండ్రి క్రిష్ణమాచారి ఫిర్యాదు మేరకు త్రీటౌన్‌పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ఠ

యాడికి : మండలకేంద్రంలో రూ.4.5కోట్లతో నిర్మించిన చౌడేశ్వరీదేవి ఆలయాన్ని శుక్రవారం తొగటవీర క్షత్రియులు ఘనంగా ప్రారంభించారు. ఆలయంలో చౌడే శ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. 11 సంవత్సరాల కిందట చేపట్టిన ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం గమనార్హం.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గార్లదిన్నె, మార్చి 1: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని చైల్డ్‌లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ కృష్ణమూర్తి సూచించారు. శుక్రవారం మండలంలోని పాఫినేపాళ్యంలో బుక్కరాయసముద్రం మండలం శ్రీనివాసరామానుజం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ క్యాంపు సేవా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి సర్వే (ఉద్యోగ సమాచారం- అక్షరాస్యత) సమాచారాన్ని సేకరిస్తామన్నారు. ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు, ఆర్గానిక్ ఫుడ్ ఉపయోగం, డిజిటల్ లావాదేవీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రామానుజం కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి వీరప్రకాష్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిచిన్నపల్లయ్య, ప్రిన్సిపాల్‌బాలకృష్ణ, అధ్యాపకురాలుకిరణ్మయి పాల్గొన్నారు.

లారీ ఢీకొని రైతు దుర్మరణం



చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

ధర్మవరంరూరల్, మార్చి 1: కనగానపల్లి మండలంలోని దాదులూరు కొట్టాల వద్ద 44వ జాతీయ రహదారిలో శుక్రవారం తెల్లవారజామున లారీ ఢీకొని ఓ రైతు మరణించాడు. దాదులూరు కొట్టాల గ్రామానికి చెందిన రైతు చంద్రశేఖర్‌రెడ్డి (38) తనకున్న ఐదెకరాల పొలంలో దానిమ్మ సాగుచేశాడు. తోటకు నీళ్లు పెట్టేందుకు శుక్రవారం తెల్లవారజామున వెళ్లాడు. అనంతరం ఇంటికి వచ్చేందుకు రోడ్డు దాటుతుండగా బెంగుళూరు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న ఓ లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్‌రెడ్డి అక్కడికక్కడే మరణించాడు. అతనికి భార్య వనతి, కుమారుడు ఉన్నాడు. మృతదేహాన్ని కనగానపల్లి పోలీసులు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి చెన్నారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మద్యం విక్రేత అరెస్ట్

అనంతపురం క్రైం, మార్చి 1: బెల్ట్‌షాప్ తరహాలో మద్యం విక్రయిస్తున్న యువజన కాలనీకి చెందిన ఓ యువకుడిని శుక్రవారం త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

అనంతపురం అర్బన్, మార్చి 1: నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ పరీక్షా సమగ్రిని పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక శారదా స్కూల్, పొట్టి శ్రీరాములు స్కూల్, నేతాజీ పాఠశాలలోని విద్యార్థులకు అట్టలు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డిష్ ప్రకాష్, జాఫర్, తిరుపాల్, గోపాల్, రామకృష్ణ, సుధాకర్, గౌస్‌పీరా, రఘు, మున్వర్ పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రి అందజేస్తున్న గౌస్‌మొద్దీన్

చీనీకాయలు టన్ను రూ.18 వేలు

అనంతపురంరూరల్ : అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.14 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 56 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రేపు పల్స్ పోలియో

గార్లదిన్నె: పోలియో రహిత సమాజం నిర్మాణం కోసం ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి గౌతమి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడుతూ.. 0-5 వయస్సులోపు ఉన్న పిల్లలకు ఆదివారం పల్స్‌పోలియో చుక్కలు వేస్తామని, తప్పకుండా పిల్లలకు ఈ చుక్కలు వేయించాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ

రామగిరి/చెన్నేకొత్తపల్లి, మార్చి 1: సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి రామగిరి మండలంలోని కుంటిమద్ది, పోలేపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలంలోని నాగసముద్రం, చెన్నేకొత్తపల్లిలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల గదులు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు, స్థానిక అధికారులతో పోలింగ్ కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శివాంజనేయులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, అధికారులు ఉన్నారు.



సీకేపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

దోపిడీలే లక్ష్యంగా వైసీపీ పాలన

రామగిరి, మార్చి 1: దోపిడీలు, దౌర్జన్యాలు, అక్రమాలు, అవినీతే లక్ష్యంగా రాష్ట్రంలో వైసీపీ పాలన సాగుతోందని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ నేతలకు ఓటుతో బుద్ధి చెప్పాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. టీడీపీ గెలుపే లక్ష్యంగా అందరం ఐకమత్యంతో ముందుకు సాగుదామన్నారు. మండలంలోని శేషంపల్లి గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి టీడీపీ అమలు చేయబోయే పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, మండల కన్వీనర్ సుధాకర్, సీనియర్ నాయకులు రామ్మూర్తి నాయుడు, పరంధామ యాదవ్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, శ్రీధర్ నాయుడు, మాదాపురం శంకర, శేషంపల్లి మజ్జిగ అశోక్‌కుమార్, మజ్జిగ ఆంజనేయులు, ఇటిక నల్లప్ప, మల్లెల ఆంజనేయులు,నాగేంద్ర, ఆనంద్, తిరుపాలప్ప, ఈశ్వరయ్య, సానిపల్లి అక్కులప్ప, కుళ్లాయప్ప, రఘురాం, లింగమయ్య పాల్గొన్నారు.



శేషంపల్లిలో టీడీపీ నాయకుల ప్రచారం

హుండీ ఆదాయం లెక్కింపు

గార్లదిన్నె: మండలంలోని కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలోని హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని దేవదాయశాఖ ఈఓ బాబు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం లెక్కించారు. ఆలయంలో మొత్తం నాలుగు హుండీలు ఉండగా... అందులో రెండు హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని మాత్రమే శుక్రవారం లెక్కించినట్లు ఆయన తెలిపారు. మాఘం మాసం నెలలో మూడు వారాలకు గాను వీటి ద్వారా రూ. 3,14,880 ఆదాయం వచ్చిందని, మిగిలిన రెండు హుండీల ఆదాయాన్ని త్వరలో లెక్కిస్తామని తెలిపారు.



ఘనంగా అనంతరాముడి జన్మదినం

అనంతపురం సెంట్రల్, మార్చి 1: అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అనంత రాముడి జన్మదిన వేడుకలను, కళాశాల 16వ వార్షికోత్స వాన్నీ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, మాజీ ఐఆర్ఎస్ నరసింహప్ప అనంతరాముడికి శుభాకాంక్షలు తెలిపారు. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన అనంత రాముడు విద్యాసంస్థలను నెలకొల్పి సాంకేతిక విద్యనం దిస్తుండటం అభినందనీయమని వీసీ అన్నారు. విద్యను వ్యాపారంగా కాకుండా, పోటీ ప్రపంచంలో విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్న లక్ష్యంగా విద్యాసంస్థలను స్థాపించామని అనంత రాముడు అన్నారు. ఆధునిక టెక్నాలజీ, నూతన ఆవిష్కరణలతో అభివృద్ధి సాధించి.. సమాజానికి ఉపయోగప డాలని విద్యార్థులకు కళాశాల వైస్ చైర్మన్ రమేష్ నాయుడు సూచించారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ రామమూర్తి, నైపుణ్యాభివృద్ధి సంచాలకుడు సురేంద్రనాయుడు పాల్గొన్నారు.



వేడుకలను ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

వైభవంగా పెద్ద కదిరప్ప స్వామి కల్యాణోత్సవం




కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుంతకల్లుటౌన్, మార్చి 1: మండలంలోని ఎన్ వెంకటాపల్లి గ్రామం కొండపై వెలసిన పెద్ద కదిరప్పస్వామి కల్యాణోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున అర్చకులు ఆలయ ఆవరణలో లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పుష్పాలంకరణ చేశారు. మేళతాళాల మధ్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పార విశ్వనాథ్, పొట్టిపాడు వారి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ఉదయం 8గంటలకు 41 జంటలకు సామూహిక వివాహాలను జరిపించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తిని రథంలో కొలువుదీర్చి ఊరేగించారు. రథంపైకి భక్తులు అరటి పండ్లు, చెరకుగడలు విసిరి మొక్కులు తీర్చుకున్నారు.



ఇలా చేస్తే తీసేస్తాం..!

- యోగా టీచర్లకు ప్ర'బుద్ధుల' బెదిరింపులు
- ఆంధ్రజ్యోతి కథనంతో బీవైహెచ్ఎఫ్ ఉలికిపాటు
- వాట్సాప్ గ్రూపుల నుంచి వందల మంది తొలగింపు
- గుంటూరుకు వస్తే సెటిల్ చేస్తామని బుజ్జగింపు





'సీఎస్ఆర్ ఫండ్స్ కోసం ప్రయత్నిస్తున్నాం' అంటూ చూపుతున్న లేఖలు

అనంతపురం విద్య, మార్చి1: బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ ఆగడాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఏజెంట్లు, బ్రోకర్ల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులకు వల వేసి లక్షలు గుంజిన వ్యవహారాన్ని ఆంధ్రజ్యోతి బట్టబయలు చేసింది. 'అక్రమాల యోగాసనం' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. దీంతో ఆ సంస్థ నిర్వాహకుల్లో కీలకంగా వ్యవహరించే ఓ వ్యక్తి కొందరు యోగా టీచర్లకు ఫోన్ చేసి బెదిరింపులకు దిగారు. బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ (బీవై హెచ్ఎఫ్) బ్యాచ్‌ల పేరుతో ఉన్న గ్రూపుల నుంచి ఆ సంస్థ నిర్వాహకులు సుమారు వంద మందిని తొలగించినట్లు తెలిసింది. 'న్యూసెన్స్ క్రియేట్ చేయవద్దని ఆరు నెలల నుంచి చెబుతున్నాను. అయినా చేస్తున్నారు' అని ఓ టీచర్‌కు ఫోన్ చేసి మండిపడ్డారట. 'మీరు ఎంప్లాయిమెంట్ అగ్రిమెంట్ ఫాంను క్లియర్‌గా చదువుకుని సంతకాలు చేశారు. ఇలా చేస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తాం' అని హెచ్చరించారని బాధితులు వాపోయారు. 'మీడియాకు సమాచారం ఇస్తే మీకే ఇబ్బంది' అని హెచ్చరించినట్లు తెలిసింది. యోగా టీచర్స్ ఫౌండేషన్ పేరిట గ్రూపులు పెట్టుకుని చర్చలు చేసినా, న్యూసెన్స్ క్రియేట్ చేసినా ఉద్యోగాల నుంచి తొలగిస్తామని, జీతాలు కూడా ఇవ్వబోమని బెదిరించారు. 'మార్చి 10వ తేదీన గుంటూరు వంద మంది కాకుంటే.. వెయ్యి మంది రండి. కూర్చుని సెటిల్ చేస్తా' అని కొందరిని బుజ్జగించే ప్రయత్నాలు కూడా ఆ వ్యక్తి చేశారని సమాచారం.

భారీగానే బాధితులు

బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ నిర్వాహకుల వలలో చిక్కుకున్నవారు రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది ఉన్నారని తెలిసింది. విశాఖపట్టణానికి చెందిన ఓ బాధితుడు రూ.2.50 లక్షల వరకూ నిర్వాహకులకు చెల్లించానని వాపోయాడు. అతను విధుల్లో చేరి పది నెలలు అవుతున్నా ఒక్క రూపాయి కూడా జీతం చెల్లించలేదని సమాచారం. కొందరు బ్రోకర్లు, ఏజెంట్ల ద్వారా రూ.2 లక్షలు, రూ.3 లక్షలు వసూలు చేసి మోసగించారు. కదిరి ప్రాంతంలో వ్యవసాయశాఖలో పనిచేసే ఓ ఉద్యోగి ఇదే తరహాలో తన కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇప్పించినట్లు సమాచారం. ఆయన అంతటితో ఆగకుండా, కమీషన్లు వస్తాయని ఏజెంట్ అవతారం ఎత్తి మరి కొందరికి కూడా ఉద్యోగాలు ఇప్పించారు. ఆంధ్రజ్యోతి కథనంతో ఈ కుంభకోణం బయటపడటంతో బాధిత టీచర్లు ఆయనకు ఫోన్ చేస్తున్నారు. ఆయన గురువారం నుంచి ఫోన్ ఎత్తడం లేదని బాధితులు వాపోయారు. ఈ క్రమంలో శ్రీసత్యసాయి జిల్లాలో బాధితులు ఏకమౌతున్నారు. రెండు రోజుల్లో కలెక్టర్, ఎస్పీని కలిసి ఫిర్యాదు చేయనున్నారని తెలిసింది. మరో జిల్లాలో ఓ వ్యక్తి లక్షలాది రూపాయలు నిర్వాహకులకు, ఏజెంట్లకు చెల్లించారు. జీతాలు అందకపోవడంతో మోసపోయామని, బతుకే ఆశ లేదని ఆవేదనకు లోనయ్యారు. 'ఆత్మహత్య చేసుకుంటా..' అని తోటి యోగా టీచర్ల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

సీఎస్ఆర్ ఫండ్స్ వస్తేనే జీతాలట..!

బుద్ధ యోగా హెల్త్ ఫౌండషన్ నిర్వాహకులు టీచర్ల జీతాలకు కార్పొరేట్ కంపెనీలతో లింకు పెడుతున్నారట. కార్పొరేట్ కంపెనీలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద ఫండ్స్ ఇస్తాయని, ఆ డబ్బు రాగానే జీతాలు చెల్లిస్తామని చెబుతున్నట్లు తెలిసింది. ముంబాయి, ఢిల్లీ వంటి పెద్ద నగరాల్లో ఉండే ప్రముఖ బ్యాంకులు, కంపెనీలు.. సీఎస్ఆర్ కింద దయ తలచి ఫండ్స్ ఇస్తేనే యోగా టీచర్లకు జీతాలు చెల్లిస్తారట. 'ఆరేడు నెలల నుంచి పెద్ద పెద్ద కంపెనీలను ఫండ్స్ అడుగుతున్నాం. రాగానే జీతాలు చెల్లిస్తాం..' అని యోగా టీచర్లను వారు మభ్యపెడుతున్నారు. జీతాలు ఇవ్వాలని నిలదీస్తే పెద్ద కంపెనీలకు లెటర్లు రాసినట్లు కొన్ని కాగితాలు చూపిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఎవరైనా తాము చెల్లించిన డబ్బులు, జీతాలు అడిగితే బెదిరిస్తున్నారు. గ్రూప్స్ నుంచి తొలగిస్తున్నారు. తాజాగా వారి బండారం బయట పడటంతో వందలాది మంది పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.



విద్యాదీవెన చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు, సంక్షేమశాఖల అధికారులు

విద్యాదీవెన సొమ్ము విడుదల

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 1: జిల్లాలోని 40,006 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.29,07,75,479 విద్యాదీవెన సొమ్ము శుక్రవారం జమ అయినట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జగనన్న విద్యా దీవెన పథకం సొమ్ము విడుదల కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. 7,104 మంది ఎస్సీ విద్యార్థులకు రూ. 4.69 కోట్లు, 1,635 మంది ఎస్టీ విద్యార్థులకు రూ. 1.15 కోట్లు, 19,968 మంది బీసీ విద్యార్థులకు రూ. 13.94 కోట్లు, 2,298 మంది కాపు విద్యార్థులకు రూ. 1.84 కోట్లు, 4,987 మంది ఈబీసీ విద్యార్థులకు రూ. 4.69 కోట్లు, 3,907 ముస్లిం, మైనార్టీ విద్యార్థులకు రూ. 2.70 కోట్లు, 107 మంది క్రిష్టియన్ మైనార్టీ విద్యార్థులకు రూ. 7 లక్షల సొమ్మును తల్లుల ఖాతాలో జమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ రిజ్వాన్, సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమాదేవి, ఎస్సీ సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావ్ పాల్గొన్నారు.

పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లాలో విద్యాదీవెన ద్వారా నిధులు విడుదల చేస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఈమేరకు కలెక్టర్ మెగా చెక్కును విడుదల చేశారు. జిల్లాలోని 34,169 మంది విద్యార్థులకు సంబంధించి రూ.23.84కోట్ల విద్యాదీవెన సొమ్మును వారి తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమాధికారి శివరంగప్రసాద్, గిరిజన సంక్షేమాధికారి మోహన్‌రామ్ పాల్గొన్నారు.


ఆర్బీకేల్లో ఈ క్రాపింగ్ వివరాల ప్రదర్శన

అనంతపురం అర్బన్, మార్చి 1: రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల్లో 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి ఈ క్రాపింగ్ రైతుల జాబితాను ప్రదర్శిస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రబీ సీజన్‌లో పంటలు సాగైన 85,807 హెక్టార్లల్లో ఈ క్రాపింగ్ పూర్తైందన్నారు. జిల్లాలోని 56,621 మంది రైతులకు 55,469 మంది (98 శాతం) రైతులకు ఈ కేవైసీ పూర్తి చేయడం జరిగిందన్నారు. శుక్రవారం నుంచి ఈనెల 3వతేదీ వరకు ఈ క్రాపింగ్ జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తామన్నారు. ఏవైనా అభ్యంతరాలు, తప్పులు ఉంటే అర్జీలు ఇవ్వాలన్నారు. ఆయా అర్జీలను ఈనెల 5లోగా ఏఓ, తహశీల్దార్ పరిష్కరిస్తారని, ఈనెల 8న ముసాయిదా క్రాపింగ్ జాబితాను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పసికందు అనంతకు రెఫర్



హిందూపురం అర్బన్, మార్చి 1: స్థానిక జిల్లా ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన మగ శిశువును మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి రెఫర్ చేశారు. గురువారం రాత్రి హిందూపురం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతి నేతృత్వంలో ఇద్దరు అంగన్‌వాడీ కార్యకర్తలు, పోలీసు సహకారంతో అంబులెన్స్‌లో శిశువును తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు వెంటిలేటర్‌పై ఉంచి, చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో బిడ్డను పరిరక్షిస్తున్నట్లు తెలిపారు.



మరమ్మత్తు..!



- జిల్లా జీవనాడిపై నేతల నిర్లక్ష్యం
- హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు పట్టని ప్రభుత్వం
- ఐదేళ్లలో ఒక్క పైసా విదల్చని దుస్థితి
- నీరందక అన్నదాతకు తప్పని ఆవేదన



హోస్పూరు వద్ద కూలిపోయిన వంతెన(ఫైల్)

బొమ్మనహాళ్, మార్చి1: హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులపై ప్రభుత్వం మత్తు వదలడం లేదు. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పనులు అటకెక్కాయి. కరువుజిల్లా అనంతపురానికి జీవనాడి అయిన హెచ్చెల్సీ కాలువల దుస్థితిపై అన్నదాత ఆందోళన చెందుతున్నారు. ప్రధాన కాలువతోపాటు ఉపకాలువలు సైతం దెబ్బతిన్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 12 మంది వైసీపీ ఎమ్మెల్యేలు, ఇద్దరు పార్లమెంట్ సభ్యులు ఉన్నా హెచ్చెల్సీ అభివృద్ధి ప నులు ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా ఉంది. తుంగభద్ర జలాశయం నుంచి అనంతపురం జిల్లాకు తాగు, సాగునీటి ప్రధాన కాలువ ఆధునికీకరణ పనులు 105 కి.మీ. నుంచి 2008లో పనులు ప్రారంభమయ్యాయి. కొంతవరకు చేసిన పనులకు రూ.450 కోట్లలో రూ.300 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన రూ.150 కోట్ల పనులు చేపట్టాల్సి ఉంది. ఈ ఐదేళ్ల కాలంలో నిధులు విడుదల కాకపోవడంతో పనులు ఒక్క అడుగూ కదలలేదు. ఆంధ్ర సరిహద్దులోని బొమ్మనహాళ్, ఉద్దేహాళ్, దర్గాహోన్నూరు, డీ.హీరేహాళ్ మండలం మల్లికేతి, కణేకల్లు మండలం మీనహళ్లి గ్రామాల శివార్లలో ఉన్న హెచ్చెల్సీ వంతెనలు కూలిపోయాయి. వీటిని కొన్నిచోట్ల రైతులే చందాలు వేసుకుని బాగుచేసుకున్నారు. హెచ్చెల్సీ కాలువకు గండ్లు పడి ప్రధానకాలువ గట్టు దెబ్బతిన్నాయి. బలహీనమైన ప్రదేశాల్లో చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కూడా అధికారయంత్రాంగం మరిచింది. హెచ్చెల్సీ కాలువ గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారని అధికారులకు, పాలకులకు ఆధునీకీకరణ పనులపై శ్రద్ధ లేకపోవడం దుర్మార్గమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైలాపురం, నాగలాపురం ప్రాంతాల్లో గండ్లు పడినప్పటికీ అధికారులు తాత్కాలిక ఇసుక బస్తాలు వేసి చేతులు దులుపుకున్నారని విమర్శిస్తున్నారు. కాలువపై 105 కి.మీ. నుండి 189 కి.మీ. వరకు సుమారు 50 వరకు బ్రిడ్జిలు ఉన్నా.. అవి బాగా దెబ్బతిన్నాయి. ఆంధ్ర సరిహద్దులో 105 కి.మీ. వద్ద 2,500 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండేది. దానిని 4,500 క్యూసెక్కులకు పెంచాలనే లక్ష్యంతో ఆధునికీకరణ పనులను చేపట్టారు. పనులు పూర్తి అయితే 2.90 లక్షల ఎకరాల ఆయకట్టు సాగునీటితోపాటు ప్రజలకు అవసరాలకు అనుగుణంగా తాగునీరు సరఫరా చేసేందుకు అవకాశం ఉంది. మరమ్మతులు చేపట్టకపోవడంతో జిల్లాకు రావాల్సిన నీటి వాటాను రైతులు కోల్పోవాల్సి వచ్చింది. నవంబర్‌లోనే తుంగభద్ర జలాశయం నుంచి నీటి సరఫరా ఆగిపోయింది. డిసెంబర్ చివరి వరకు అందాల్సిన నీరు అందక బోరుబావులు లేనిచోట వరిపంట ఎండిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం హెచ్చెల్సీ ఆధునికీకరణకు ప్రాధాన్యం ఇచ్చింది. నాణ్యతగా పనులు పూర్తి చేసింది. నీటి ప్రవాహం పెరిగి అక్కడి ఆయకట్టు రైతులు సంతోషంగా పంటలు సాగు చేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంపై రైతులు మండిపడుతున్నారు.

హెచ్చెల్సీని నిర్వీర్యం చేశారు: కేశవరెడ్డి, హెచ్చెల్సీ సాగునీటి సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు



జిల్లాకు ప్రాణాధారమైన ఎగువకాలువను మరమ్మత్తులు చేపట్టడంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. బొమ్మనహాళ్, డీ.హీరేహాళ్ మండలాల పరిధిలోని నాగలాపురం, మైలాపురం తదితర ప్రాంతాలలో హెచ్చెల్సీ కాలువ తీవ్ర అధ్వాన్నంగా తయారైంది. కాలువ దెబ్బతిని గట్లు బలహీనపడ్డాయి. డిస్ట్రిబ్యూటరీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కాలువకు గట్టుదిట్టమైన చర్యలు చేపట్టలేదు. హెచ్చెల్సీ కాలువను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఏ రకమైన సమస్యలున్నాయి. ఏ రకమైన మరమ్మత్తులు అవసరమో పాలకులు, అధికారులు దృష్టి పెట్టలేదు. యుద్ధ ప్రాతిపదికన ఏమి చేయాలి, శాశ్వత ప్రతిపాదికన ఏమి చేయాలన్న ఆలోచన ఈ వైసీపీ ప్రభుత్వంలో అధికారులు, పాలకులు దృష్టి పెట్టలేదు. ఈ ఐదేళ్లలలో హెచ్చెల్సీని నిర్వీర్యం చేశారు.

నీరు లేక భూమి కౌలుకు ఇచ్చేశా: నిరంజన్, రైతు, బొమ్మనహాళ్



కృష్ణాపురం గ్రామం వద్ద 10 ఎకరాల పొలాన్ని సొంతంగా సాగు చేస్తుండేవాడిని. ఈ ఐదేళ్ల కాలంలో హెచ్చెల్సీ కాలువపై వంతెనలు కూలిపోయాయి. గండ్లు పడ్డాయి. దీంతో గండ్లు పూడ్చేందుకు నీటి సామర్థ్యాన్ని తగ్గిస్తున్నారు. ఆయకట్టుకు నీరు అందక పంట దిగుబడిపై ప్రభావం పడేది. ప్రభుత్వం కూడా హెచ్చెల్సీ పనులపైన ఎలాంటి శ్రద్ధ చూపలేదు. దీంతో గత ఖరీఫ్‌లో కూడా నీటి సమస్య ఉంటుందని హెచ్చెల్సీ కాలువ సక్రమంగా లేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో చేసేదేమీ లేక 10 ఎకరాల పొలాన్ని తక్కువ ధరకే కౌలుకు ఇచ్చేశాను.

బోర్లపైనే ఆధారపడ్డాం: ఆంజనేయులు, రైతు, దేవగిరి



హెచ్చెల్సీకి సాగునీరు ఆలస్యంగా రావడం, ఆయకట్టుకు నీటి విడుదలలో జాప్యం , కాలువకు ప్రమాదాలు చోటు చేసుకోవడం కారణాలతో ఆయకట్టుకు సక్రమంగా నీరు అందేది కాదు. వ్యవసాయ బోర్లతోనే ఈ ఐదేళ్ల కాలంలో వ్యవసాయ బోర్లతోనే పంటలు సాగుచేశాము. ఆధునీకీకరణ పనులు పూర్తి చేసి కాలువపై వంతెనలు కొత్తవి నిర్మించి ఉంటే సాగునీరు సక్రమంగా అందేవి. ప్రభుత్వం హెచ్చెల్సీపై ఎలాంటి శ్రద్ధ పెట్టలేదు. వంతెనలు బాగా దెబ్బతిని ప్రధాన కాలువ గట్లు బలహీన పడ్డాయి. ప్రభుత్వం చొరవ చూపి హెచ్చెల్సీపై శ్రద్ధ పెట్టాలి.

పరీక్షల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి: ఎస్టీయూ

అనంతపురం విద్య, మార్చి 1 : త్వరలో జరిగే 10వ తరగతి పరీక్షల విధుల నుంచి చిన్న పిల్లల తల్లులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులను మినహాయించాలని ఎస్టీయూ నాయకులు.. డీఈఓ వరలక్ష్మిని కోరారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు.. డీఈఓను ఆమె చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజనేయులు ఇతర నాయకులు మాట్లాడుతూ... పరీక్షల విధుల్లో కొంత మినహాయింపు ఇవ్వాలన్నారు. స్పాట్ వాల్యూయేషన్‌కు 20 శాతం అదనంగా టీచర్లను నియమించాలని, మెడికల్ బిల్లులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు. సంఘం రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, ఇతర నాయకులు సూర్యానారాయణ, సురేష్ కుమార్, మహమ్మద్ రఫీ, రాజశేఖర్, దివాకర్ నాయుడు, మురళీకృష్ణ, ప్రభాకర్, మల్లికార్జున, విరూపాక్షి పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

మోడల్ స్కూళ్లలో ఆరో తరగతికి ప్రవేశాలు

- రేపటి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు

అనంతపురం విద్య, మార్చి 1: ఏపీ మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ ఉత్తర్వు జారీ చేశారని డీఈఓ వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 3వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. విద్యార్థులు ఓసీ, బీసీ విద్యార్థులు1-9-2012 నుంచి 31-8-2014 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1-9-2010 నుంచి 31-8-2014 మధ్య పుట్టిన వారై ఉండాలన్నారు. అదేవిధంగా జిల్లాలో ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో చదివి ఉండాలన్నారు. 6వ తరగతిలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఆంగ్లంలోనే బోధన ఉంటుందన్నారు. విద్యార్థులు చదువుకో వడానిక ఎలాంటి పరీక్షల ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కేవలం ప్రవేశ పరీక్షల కోసం ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 150, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ. 75 చెల్లించాలన్నారు. ఈనెల 2వతేదీ నుంచి 31వ తేదీ వరకూ నెట్ బ్యాంకింగ్ లేదా క్రెడిట్ కార్డ్, డేటా కార్డ్‌లను ఉపయోగించి పేమెంట్ గేట్‌వే ద్వారా ఫీజు చెల్లించాలన్నారు. తర్వాత కేటాయించిన జనరల్‌నెంబర్ ఆధారంగా www.cse.ap.gov.in, www.apms.apcfss.in వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు. ఏప్రిల్ 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మండలాల్లోని మోడల్ స్కూళ్లలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులకు 5వ తరగతి స్థాయి సిలబస్‌తోనే ఆంగ్లమాధ్యమంలో ప్రవేశ పరీక్షలు ఉంటాయని తెలియజేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జోనల్ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అభ్యర్థి

4న పెనుకొండకు చంద్రబాబు

- కియ వద్ద 'రా.. కదలిరా' సభ



పెనుకొండ టౌన్, మార్చి 1: టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 4న శ్రీసత్యసాయి జిల్లా పర్యటనకు వస్తున్నారు. పెనుకొండ సమీపంలోని కియ కార్ల పరిశ్రమ ఎదురుగా 'రా కదలిరా' బహిరంగ సభలో ఆయన పాల్గొంటారని పార్టీ 5వ జోన్ ఇన్‌చార్జి రవీంద్ర, పెనుకొండ నియోజకవర్గ అభ్యర్థి సవిత శుక్రవారం తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన కియ పరిశ్రమ ద్వారా వేలాది కుటుంబాలు బాగుపడ్డాయని వారు అన్నారు. ఈ విషయాన్ని గుర్తు చేస్తూ.. ఈనెల 4న టీడీపీ అధినేత చంద్రబాబు నేతృత్వంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను వారు పరిశీలించారు.

అంతర్జాతీయంగా జేఎన్‌టీయూకు సత్సంబంధాలు

- న్యాక్ గ్రేడింగ్ 'ఏ' రావడం హర్షణీయం • వీసీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

అనంతపురం సెంట్రల్, మార్చి1: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేలా అంతర్జాతీయంగా జేఎన్‌టీయూ సత్సంబంధాలను మెరుగు పరుచుకోబుతున్నట్లు వీసీ ప్రొఫెసర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూ పరిపాలనా భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వీసీ మాట్లాడుతూ జేఎన్‌టీయూకి నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) గ్రేడింగ్ 'ఏ' గుర్తింపు లభించడం హర్షణీయమన్నారు. 80 సంవత్సరాల చరిత్రగల జేఎన్‌టీయూ రాయలసీమ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యనందిస్తూ జాతీయస్థాయిలో ఖ్యాతి గడించిందన్నారు. న్యాక్ గుర్తింపు ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కొలాబ్రేషన్స్ పెంచుకుని రీసెర్చ్, ప్రాజెక్టులపై దృష్టిసారిస్తామన్నారు. తద్వారా డీఎస్టీ సంస్థ ద్వారా రూ.50కోట్ల నిధులతో ప్రాజెక్టును తీసుకువస్తున్నామన్నారు. న్యాక్ గుర్తింపు వర్సిటీ ఒక ఆభరణం లాంటిదని విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్ మాట్లాడుతూ న్యాక్ గుర్తింపు సాధించేందుకు ఏడాదిపాటు బోధన, బోధనేతర సిబ్బంది ఎనలేని కృషిచేశారని కొనియాడారు. న్యాక్ బృంద పర్యటన సందర్భంగా దాదాపు నెలరోజులు సెలవులు తీసుకోకుండా శ్రమించారని అందుకు కృతజ్ఞతలని పేర్కొన్నారు. ఐక్యూఏసీ డైరెక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ న్యాక్ మాక్ కమిటీని ఏర్పాటుచేసి మూడు సార్లు ముందుస్తుగా పరిశీలించడం జరిగిందన్నారు. దీంతో లోటుపాట్లను సరిదిద్దుకుని ఏ గ్రేడింగ్ సాధనకు తోడ్పడిందన్నారు. అంతకుముందు ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో న్యాక్ గుర్తింపు ఆనందోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డైరెక్టర్లు ఈశ్వరరెడ్డి, సుజాత, శుభాబింధు, విశాలి, సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే టీడీపీ లక్ష్యం

ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్


సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తున్న కేశవ్

విడపనకల్లు, మార్చి 1: పేదల అభివృద్ధే లక్ష్యంగా టీడీపీ పని చేస్తుందని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై రూపొందించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో పేదలు, యువతకు తీరని అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి అధోగతి పాలు చేశారన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు మండల కన్వీనర్ బీడీ చిన్న మారయ్య, మాజీ ఎంపీపీ ప్రతాప్‌నాయుడు, సర్పంచ్‌లు చంద్రశేఖర్, తిప్పారెడ్డి, తిమ్మరాజు, జనార్ధననాయుడు, నాయకులు హనుమంతు, రామాంజనేయులు, జయరాములు, విజయ్‌శెట్టి, రంగస్వామి, రాజు స్వామి, రవీంద్ర, రాజా, భీమలింగప్ప, దేవేంద్ర పాల్గొన్నారు.

కౌకుంట్లలో కేశవ్ తనయుడి ప్రచారం

ఉరవకొండ: మండలంలోని కౌకుంట్లలో శుక్రవారం సాయంత్రం బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విక్రమసింహ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. సూపర్‌సిక్స్ పథకాల వలన కలిగే లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ ఎర్రిస్వామి, పయ్యావుల ప్రభాకర్, భాస్కర్, మారెప్ప, వెంకటేశులు, ప్రసాద్ పాల్గొన్నారు.

కదిరప్ప ఆలయంలో వెంకట శివుడు పూజలు


పూజలు చేస్తున్న వెంకట శివుడు యాదవ్

గుంతకల్లు, మార్చి1: మండలంలోని ఎన్ వెంకటాంపల్లి గ్రామం వద్దనున్న పెద్ద కదిరప్ప స్వామి దేవాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ పూజలు నిర్వహించారు. ఆలయంలో లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించగా వెంకట శివుడు యాదవ్ హాజరయ్యారు. రానున్న కొత్త తెలుగు సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు చేసినట్లు తెలిపారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ఠ



యాడికి, మార్చి1: మండలకేంద్రంలో రూ.4.5కోట్లతో నిర్మించిన చౌడేశ్వ రీదేవి ఆలయాన్ని శుక్రవారం తొగటవీర క్షత్రియులు ఘనంగా ప్రారంభించారు. ఆలయంలో చౌడే శ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. 11 సంవత్సరాల కిందట చేపట్టిన ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించ డం గమనార్హం. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

గుంతకల్లు టౌన్, మార్చి 1: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓగా శ్రీకాంత్‌చౌదరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటరమణప్ప ఫిబ్రవరి 29న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో కదిరి ఎంపీడీఓగా పనిచేస్తున్న శ్రీకాంత్‌చౌదరిని గుంతకల్లు ఎంపీడీఓగా బదిలీ చేశారు.

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

యల్లనూరు, మార్చి1: మండలంలోని తిరుమలాపురం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న యోగానందరెడ్డిని అరెస్ట్ చేసి అతడి నుంచి 15మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ గిరిబాబు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



తాడిపత్రిటౌన్, మార్చి1: మండలంలోని ఆవులతిప్పాయపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఓబులేసుకోనలో లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చనలు, అభిషేకాలతోపాటు వివిధ పుష్పాలతో అలంకరణ చేశారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకొన్నారు.

పోలియోచుక్కలు వేయించాలి


పల్స్‌పోలియోపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్, మార్చి 1: ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు పోలియోచుక్కలు తప్పకుండా వేయించాలని బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట గ్రామాల ప్రాథమిక వైద్యశాల సిబ్బంది సూచించారు. శుక్రవారం మండలంలోని ఉద్దేహాళ్, లింగదహాళ్ గ్రామాలలో పల్స్‌పోలియోపై ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 3న ఐదు సంవత్సరాల్లోపు పిల్లలకు పోలియోచుక్కలు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శరణప్ప, వైద్యసిబ్బంది జైనబీ, గోవర్ధన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలకు నిప్పు

బెళుగుప్ప, మార్చి 1: మండలంలోని శ్రీరంగాపురంలో రైతు పండు రంగారెడ్డి ఇంటిపై ఉన్న డ్రిప్ పరికరాలకు గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టి దగ్ధం చేసినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి మంటలు చెలరేగడంతో గ్రామస్థులు, బాధిత రైతులు ఆర్పివేసినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో 30 కట్టల డ్రిప్ వైర్లు కాలిపోయాయని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా గొరవయ్యలకు పాలుపోయు కార్యక్రమం


పాలుపోయు కార్యక్రమంలో నృత్యాలు చేస్తున్న గొరవయ్యలు

కుందుర్పి, మార్చి 1: మైలార లింగేశ్వరస్వామి రథోత్సవంలో భాగంగా శుక్రవారం గొరవయ్యలకు పాలుపోయు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ఆలయం ముందుంచి భక్తులు తెచ్చిన అరటిపళ్లను తింటూ పాలు తాగుతూ, నృత్యాలు చేస్తూ గొరవయ్యలు ఆకట్టుకున్నారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం


రాయదుర్గంలో హాల్‌టిక్కెట్ నంబర్లను పరిశీలిస్తున్న విద్యార్థులు


తాడిపత్రిలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

గుత్తి, మార్చి1: పట్టణంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్, మోడల్ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

గుంతకల్లుటౌన్: ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ, శ్రీశంకరానందగిరి స్వామి, సరస్వతి, నారాయణ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 1689 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 37 మంది గైర్హాజరయ్యారు.

పామిడి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 354 మంది విద్యార్థులకుగాను 339 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా రాజ్యలక్ష్మి, డిపార్ట్‌మెంటల్ అధికారిగా శిరీష విధులు నిర్వహించారు. శనివారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 254 మంది పరీక్ష రాయనున్నట్లు వారు తెలిపారు.

ఉరవకొండ: పట్టణంలో ఇంటర్ పరీక్షలు శుక్రవారం అసౌకర్యాల నడుమ ప్రారంభమయ్యాయి. స్థానిక జూనియర్ కళాశాలలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. గదుల కొరత కారణంగా వరండాలోనే విద్యార్థులు ఎండలోనే కూర్చొని పరీక్షలు రాయాల్సి వచ్చింది. సౌకర్యాలు కల్పించపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు. మొత్తం 715 మంది విద్యార్థులకుగాను 665 మంది పరీక్షలు రాశారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని నాలుగు కేంద్రాల్లో శుక్రవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సీవీరామన్ జూనియర్ కళాశాల, టెక్ జూనియర్ కళాశాల, మోడల్‌స్కూళ్లల్లో మొత్తం 1521మంది విద్యార్థులకు గాను 1445మంది విద్యార్థులు హాజరుకాగా 76మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

బొమ్మనహాళ్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలను ప్రారంభించారు. మొదటిరోజు తెలుగు, హిందీ పరీక్షలు నిర్వహించారు. 287 మందికిగాను 263 మంది హాజరయ్యారు.

రాయదుర్గం: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాలలో 1192 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1152 మంది పరీక్షలు రాశారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 507 మంది విద్యార్థులకు 20 మంది గైర్హాజరై 487 మంది పరీక్షలు రాశారు. మోడల్ కాలేజ్‌లో 462 మందికి 15 మంది గైర్హాజరై 447 మంది హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో 223 మంది విద్యార్థినులకు గాను ఐదుగురు గైర్హాజరై 218 మంది పరీక్షలు రాశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతంతో పాటు ఒకేషనల్ కోర్సులకు పరీక్షలు జరిగాయి.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, మార్చి 1: మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. టీడీపీ మాజీ కన్వీనర్ చలపతి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన కార్యకర్తలు టీడీపీలో చేరారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు వారికి కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఆనంద , చిన్న, ఎర్రి స్వామి, లక్ష్మిరెడ్డి, దివాకర్, గోవిందు, సన్నరెడ్డి తదితరులు వైసీపీ నుండి టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ చంద్ర బాబు ముఖ్యమంత్రి కావాలని మహిళలు, యువత కోరుకుంటున్నార న్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవిందు, రామాంజనేయులు, యోగి, లక్ష్మణ్ణ, దివాకర్, జయసింహ, శరత్‌బాబు, హనుమంతు, ఆంజనేయులు, క్రిష్ణ పాల్గొన్నారు.

కాలవకు సన్మానం

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులుకు రంగాపురం క్యాంప్‌నకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు శుక్రవారం సన్మానం చేశారు. రాయదుర్గం నియోజకవర్గం తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థిగా కాలవ శ్రీనివాసులును నియమించడంతో రాయదుర్గంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చలపతి, దివాకర్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలంటే ఇంత నిర్లక్ష్యమా?

● సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్


ఉర్దూ కళాశాల వద్ద ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు, మార్చి 1: పట్టణంలో నిర్మించిన ఉర్దూ కళాశాల, బాల బాలికల వసతి గృహాలను వైసీపీ ప్రభుత్వం ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని ఎస్కేపీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న ఉర్దూ కళాశాల, బాలిక హాస్టలును సీపీఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల విద్యాభివృద్ధి కోసం టీడీపీ ప్రభుత్వం రూ. 10 కోట్లు వెచ్చించి ఉర్దూ కళాశాల, ఉర్దూ బాలికల, బాలుర హాస్టళ్లను నిర్మించిందన్నారు. టీడీపీ ప్రభుత్వం నిర్మించిందన్న ఒకే ఒక్క కారణంతో వైసీపీ ప్రభుత్వం ఈ భవనాలను ప్రారంభించకుండా వృథాగా వదిలేసిందని ఆరోపించారు. ఆ భవనాలను ప్రారంభించకపోగా, కనీసం తగిన భద్రతను కల్పించలేదన్నారు. దీంతో దుండగులు కిటికీలు, తలుపులు పగులగొట్టి ఎత్తుకెళ్లారన్నారు. బాలుర హాస్టలులో ఆర్డీవో కార్యాలయాన్ని ఏర్పాటుచేసి మైనార్టీ విద్యార్థులకు అన్యాయం చేశారన్నారు. ఎన్నికలలోపు ఈ భవనాలను ప్రారంభించకపోతే టీడీపీతో సంప్రదించి తామే ప్రారంభిస్తామని అల్టిమేటం ఇచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ గుంతకల్లులో ఉర్దూ విద్యాలయాలను ప్రారంభించకపోవడం జగన్ రివర్స్ పాలనకు నిదర్శనమన్నారు. రాష్ట్ర ద్వితీయ భాషగా ఉన్న ఉర్దూపట్ల జగన్ వివక్ష చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు బీ గోవిందు, డివిజన్ కార్యదర్శి వీరభద్రస్వామి, నాయకులు గోపి, సురేశ్, కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్ద కదిరప్ప స్వామి కల్యాణోత్సవం


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుంతకల్లు టౌన్, మార్చి 1: మండలంలోని ఎన్ వెంకటాపల్లి గ్రామం కొండపై వెలసిన పెద్ద కదిరప్పస్వామి కల్యాణోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున అర్చకులు ఆలయ ఆవరణలో లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పుష్పాలంకరణ చేశారు. మేళతాళాల మధ్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పార విశ్వనాథ్, పొట్టిపాడు వారి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ఉదయం 8గంటలకు 41 జంటలకు సామూహిక వివాహాలను జరిపించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సమూర్తిని రథంలో కొలువుదీర్చి ఊరేగించారు. రథంపైకి భక్తులు అరటి పండ్లు, చెరకుగడలు విసిరి మొక్కులు తీర్చుకున్నారు.

అధైర్య పడవద్దు.. అండగా ఉంటాం

● టీడీపీ యువ నాయకుడు ధర్మతేజగౌడ్


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు ధర్మతేజగౌడ్

పామిడి, మార్చి 1: తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు అధైర్య పడవద్దని అండగా ఉంటామని టీడీపీ యువ నాయకులు ధర్మతేజ గౌడ్ భరోసా నిచ్చారు. మండలంలోని జీ కొట్టాల గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త శివానంద కుటుంబాన్ని, అలాగే అనారోగ్యంతో బాధపడుతూ విశ్రాంతి తీసుకుంటున్న తిప్పారెడ్డిని ఆయన పరామర్శించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని టీడీపీ కార్యకర్తల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాసులు, వడ్డే ఆనంద్‌బాబు, టీడీపీ నాయకులు మల్లేష్‌రెడ్డి, రాజేష్‌నాయక్, సుదర్శన్‌బాబు, దేవదాసు, మహానంది, సుంకిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నెలకు రూ. 5వేలు

విడపనకల్లు, మార్చి 1: తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి నెలకు రూ. 5వేలు ఇస్తామని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మండలంలో ప్రచారం నిర్వహించారు. పార్టీ ఉరవకొండ నియోజకవర్గం ఇన్‌చార్జ్ రవి కృపానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్ర ప్రజలకు ప్రతి ఇంటికి రూ. 5వందలకే ఒక గ్యాస్ సిలిండర్, ప్రతి కుటుంబానికి నెలకు రూ. 5వేలు, ఇందిరమ్మ అభయాస్తం వంటివి అమలు చేస్తామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ రద్దు, రైతులకు రూ. 2లక్షలు రుణ మాఫీ చేయించి పేద ప్రజలను ఆదుకుంటాము అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సోనియా శీనా, చెన్నప్ప, శ్రీకాంత్ వర్మ, సీపీఐ నాయకులు కేశవరెడ్డి, మల్లికార్జున, ఎంబీ చెన్నరాయుడు. సీపీఎం నాయకులు మధు, రంగారెడ్డి పాల్గొన్నారు.

ఆవుదూడపై చిరుత దాడి


గాయపడిన ఆవుదూడను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 1: మండలంలోని చాపిరి గ్రామంలో శుక్రవారం ఆవుదూడపై చిరుత దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. అటవీ శాఖ అధికారులు తెలిపిన మేరకు రైతు ధనుంజయకు చెందిన ఆవుదూడపై చిరుత దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. కుక్కలు, ధనుంజయ గట్టిగా కేకలు వేస్తూ అరవడంతో చిరుత పంట పొలాల్లోకి పరుగులు తీసినట్లు తెలిపారు. అటవీశాఖ అధికారులు సంఘటన స్థలాన్ని, గాయపడిన దూడను పరిశీలించారు.

నేటి నుంచి టీడీపీ ఎన్నికల ప్రచారం

డీ.హీరేహాళ్, మార్చి 1: తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తన ఎన్నికల ప్రచారాన్ని మురడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి శనివారం ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి తెలియజేశారు. కాలవ శ్రీనివాసులు శనివారం ఉదయం కుటుంబసభ్యులతో కలిసి మురడి గ్రామానికి చేరుకుని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఆలయంలో 1116 టెంకాయలు కొట్టి అనంతరం కాలవ శ్రీనివాసులు మురడి గ్రామంలో ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాన్ని అందించిన ప్రిన్సిపాల్

రాయదుర్గంరూరల్, మార్చి 1: విద్యతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి సూచించారు. నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు కూడా తీసుకెళతుందన్నారు. శుక్రవారం క్రీడాకారులకు షటిల్‌కాక్, వాలీబాల్‌పోటీలను నిర్వహించారు. విజేతలకు నెహ్రూ యువ జన కేంద్రం వారు మెడల్స్, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువజన కేంద్ర కార్యదర్శి శ్రీనివాసులు మరియు ప్రెసిడెంట్ తిమ్మరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డీ నారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు రోటరీక్లబ్ సభ్యుల శుభాకాంక్షలు

తాడిపత్రిటౌన్, మార్చి1: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాంమోహన్‌ను శుక్రవారం రోటరీక్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ తరపున చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయనకు వివరించారు. కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, మద్దిలేటయ్య, సుబ్రహ్మణ్యం, అనిల్ ఉన్నారు.

కుక్కకాటుతో ఆరుగురికి గాయాలు

పుట్లూరు, మార్చి1: మండలంలోని అరకటవేముల గ్రామంలో కుక్కకాటుతో శుక్రవారం ఆరుగురు గాయపడ్డారు. అంజినమ్మ, అంకాలమ్మ, సౌజన్య, నాగమునెయ్య, వెంకటరాముడు, లక్ష్మీదేవిలకు గాయాలు కావడంతో ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నారు. గ్రామంలో కుక్కలు వెంట పడి దాడి చేస్తున్నట్లు గ్రామస్థులు సచివాలయంలో అధికారులకు ఫిర్యాదుచేశారు. కుక్కల బారినుంచి కాపాడాలని కోరారు.

5న కసాపురం ఆలయ హుండీ సొమ్ము లెక్కింపు

గుంతకల్లు, మార్చి1: మండలంలోని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలోని హుండీల సొమ్మును ఈనెల 5న లెక్కించనున్నట్లు ఈఓ భద్రాజీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు ఎండోమెంటు పరిశీలకుడు, ట్రస్టుబోర్డు సమక్షంలో హుండీలను తెరవనున్నట్లు తెలిపారు.

టీడీపీలోకి చేరిక


టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు

ఉరవకొండ, మార్చి 1: మండలంలోని వెలిగొండ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు శుక్రవారం టీడీపీలోకి చేరారు. కౌకుంట్లలో టీడీపీ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో 16 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వైసీపీకి చెందిన వన్నూరుస్వామి, మహేంద్ర, పవన్, యన్నప్ప, ప్రభాకర్, నాగరాజు, సిద్దప్పలకు పార్టీ కండువా వేసి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు.

వైసీపీ నిరంకుశ విధానాన్ని వీడాలి


నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 1: ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న నిరంకుశత్వ విధానాన్ని వీడాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేశులు అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీలను కూడా నెరవేర్చలేదన్నారు. వెంటనే బకాయి వున్న టీఏ, డీఏలను విడుదల చేయాలన్నారు. 12వ పీఆర్సీని అమలు చేస్తూ తక్షణమే 30 శాతం ఐఆర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల ఏపీటీఎఫ్ నాయకులు ఉపాధ్యాయులు పెన్షనర్లు పాల్గొన్నారు.

మూడు దుకాణాల్లో చోరీ

యాడికి, మార్చి1: మండలకేంద్రంలోని మూడు దుకాణాల్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. బాధితులు తెలిపిన మేరకు స్థానిక కుంటలో దుకాణాలు ఏర్పాటు చేసుకుని చంద్రశేఖర్, ఫకృద్దీన్, బాబు చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటున్నారు. గురువారం రాత్రి దొంగలు పడి చంద్రశేఖర్ దుకాణంలో రూ.15వేలు, ఫకృద్దీన్ దుకాణంలో రూ.5వేల సిగరెట్లు, బాబు దుకాణంలో రూ.30వేల సిగరెట్ ప్యాకెట్లను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జాతీయ సమైక్యత శిబిరంలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు


మనోజ్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గోపాల్

ఉరవకొండ, మార్చి1: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని శిరీష జాతీయ సమైక్యత శిబిరంలో ప్రతిభ చూపినట్లు ప్రినిపాల్ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. బెళగావిలో జరిగిన పోటీల్లో సత్తా చాటి ప్రశంసాపత్రంతో పాటు షీల్డ్‌ను అందుకుందన్నారు. విద్యార్థినిని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం పీవోలు వెంకటరాముడు, అల్తాఫ్, అధ్యాపకులు చంద్రశేఖర్, క్రిష్ణవేణి, మంజుల అభినందించారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని శ్రీశంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ మనోజ్‌కుమార్ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో అభినందన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలోని బెళగావిలో ఫిబ్రవరి 20 నుంచి 26 వరకు రాణి చెన్నమ్మ విశ్వవిద్యాలయం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత శిబిరం నిర్వహించారన్నారు. ఈ శిబిరంలో మనోజ్‌కుమార్ పాల్గొని వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచాడన్నారు. మనోజ్‌కుమార్‌ను ఎన్ఎస్ఎస్ అధికారులు సీ శివయ్య, నాగార్జున, ప్రజాసంబంధాల అధికారి బసెట్టి క్రిష్ణయ్య, పర్యవేక్షకుడు రఘు, రాఘవేంద్ర అభినందించారు.